క్లుప్తంగా

పథకాల అమలులో భాగస్వామ్యం కండి

ఎంపీడీఓ బాలశంకర్



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ

మంచాల: ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులకు అందించడంలో కార్యదర్శులు భాగస్వామ్యం కావాలని ఎంపీడీఓ బాల శంకర్ అన్నారు. శనివారం తన కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పేదరికం నిర్మూలనే లక్ష్యంగా ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని తెలిపారు. నిబంధనల ప్రకారం రాజీవ్‌యువ వికాసం, ఇందిరమ్మఇండ్లు, ఎంజీఎన్‌ఆర్‌ఈఎస్ పథకాలను ప్రజలకు అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీఓ ఉమారాణి, సూపరింటెండెంట్ అబ్దుల్ అజీమ్ తదితరులు పాల్గొన్నారు.

21నుంచి విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు



వేంకటేశ్వరస్వామి దేవాలయం

ఆమనగల్లు: తలకొండపల్లి మండలం జూలపల్లి గ్రామంలో భక్తులు, దాతల సహకారంతో పునఃనిర్మించిన శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ఈ నెల 21నుంచి విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు జరగనున్నాయి. 21న గణపతిపూజ, పుణ్యాహవాచనం, అఖండ దీపారాధన, ధ్వజారోహణం. 22న మంటప దేవత పూజా కార్యక్రమాలు, సుదర్శనహోమం, పుష్పార్చన, భజన కార్యక్రమం. 23న ఉదయం 9 గంటలకు హోమం, శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి, మహాగణపతి, జయవిజయులు, గరుడ ధ్వజ ప్రతిష్ఠాపన చేయనున్నారు. 11.30 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర కల్యాణం వైభవంగా నిర్వహించనున్నారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు.

చెంచుల అభివృద్ధికి ప్రాధాన్యత

చెంచు యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాములు



ఆమనగల్లు: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గిరిజనులు, చెంచుల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని, వారి జీవితాలలో వెలుగులు నింపుతున్నారని చెంచు యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, కాంగ్రెస్ మండల మాజీ అధ్యక్షుడు మండ్లి రాములు అన్నారు. ఆమనగల్లు పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పాలనలోనే గిరిజనులు, చెంచుల అభివృద్ధి కోసం ఐటీడీఏలు ఏర్పాటు చేసి, అనేక పథకాలు అమలు చేశారని గుర్తుచేశారు. గిరిజనులు, చెంచులకు ఇచ్చిన పోడు భూములను సస్యశ్యామలం చేసేందుకు రూ.12,600 కోట్లతో ఇందిరా సౌర జల వికాస్ పథకాన్ని ప్రభుత్వం అమలు చేయనుందని, ఈ నెల 19న నాగర్‌కర్నూల్ జిల్లా నల్లమలలోని నాచారం గ్రామంలో సీఎం ప్రారంభించనున్నారని తెలిపారు. కావున సీఎం పర్యటనను జయప్రదం చేయాలని ఆయన కోరారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు మానయ్య, రాఘవేందర్, కసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, హరిలాల్, చంద్రునాయక్ ఉన్నారు.

మీ పిల్లల భవిష్యత్‌కు మాది భరోసా

- సర్కార్ బడిలోనే చిన్నారులను చేర్పించండి
- బడిబాటలో ఉపాధ్యాయులు



ఇంటింటికి వెళ్లి ప్రచారం చేస్తున్న టీచర్లు

మంచాల: మీ పిల్లల భవిష్యత్‌కు మాది భరోసా, సర్కార్ బడికి పంపండి అని జాపాల ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బీమ్లా నాయక్ కోరారు. శనివారం మండలంలోని జాపాల గ్రామంలో ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ బడిలో నాణ్యమైన విద్య అందుతుందని, చిన్నారులకు ఉచితంగా పుస్తకాలు, యూనిఫామ్స్, భోజనం అందిస్తామని తెలిపారు. ఎనిమిది, తొమ్మిది, పది విద్యార్థులకు స్కాలర్ షిప్ సౌకర్యం ఉంటుందని పేర్కొన్నారు. ఇంగ్లిష్ మీడియంతో పాటు డిజిటల్, కంప్యూటర్ విద్య బోధిస్తున్నామని వెల్లడించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జయనందం, వనజ, లింగం పాల్గొన్నారు.

పార్కింగ్ ఇలా.. వెళ్లేదెలా?

- వాహనదారుల ఇష్టారాజ్యం
- అడ్డదిడ్డంగా పార్కింగ్
- పట్టించుకోని ట్రాఫిక్, మున్సిపల్ అధికారులు
- ఇబ్బంది పడుతున్న ప్రజలు



తుర్కయంజాల్ కూడలిలో వాహనాల రద్దీ

తుర్కయంజాల్: తుర్కయంజాల్ కూడలిలో ట్రాఫిక్ కష్టాలు రోజురోజుకు అధికమవుతున్నాయి. సాగర్ రహదారికి ఇరువైపులా ఉన్న దుకాణ సముదాయాల ఎదుట వాహనదారులు ఇష్టానుసారంగా తమ బండ్లను పార్కింగ్ చేస్తున్నారు. ఫలితంగా ట్రాఫిక్ జాం ఏర్పడి, ఇతర వాహనదారులు, ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. అయినప్పటికీ ట్రాఫిక్ పోలీసులు ప్రేక్షక పాత్ర పోషిస్తున్నారని, ఎలాంటి నివారణ చర్యలు చేపట్టకుండా ఫొటోలు తీసి, జరిమాన విధిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

గతంలో తొలగించినా..

రోడ్లపై ట్రాఫిక్ జామ్‌కు కారణం అవుతున్నాయనే కారణంతో గతంలో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగించారు. ఆ సమయంలో ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా చర్యలు చేపట్టారు. అనంతరం కొంతకాలం పాటు రోడ్డుకు ఇరువైపులా తోపుడు బండ్లు, బోర్డుల ఏర్పాటు, దుకాణాల ఎదుట ఎలాంటి నిర్మాణాలు చేపట్టలేదు. పుర అధికారుల పర్యవేక్షణ లోపం వలన పరిస్థితి ప్రస్తుతం మొదటికి వచ్చింది. మునుపటిలాగే షాపుల ఎదుట వాహనాల నిలిపివేత, ఆక్రమణలు ఊపందుకున్నాయి.

పార్కింగ్ స్థలం లేదు

సాగర్ రహదారికి ఇరువైపులా ఉన్న వాణిజ్య సముదాయాలకు వేళ్ల మీద లెక్కపెట్టే స్థాయిలో సెల్లార్ పార్కింగ్‌లు ఉన్నాయి. మిగతా వాటికి లేవు. మాస్టర్ ప్లాన్ నిబంధనలకు అనుగుణంగా నిర్మాణాలు చేపట్టకపోవడంతో పార్కింగ్ కష్టాలు ఎదురయ్యాయి. బ్యాంకులు, హోటళ్లు, మద్యం దుకాణాలు, బార్ల వద్ద అడ్డదిడ్డంగా వెహికల్స్ పార్కింగ్‌తో ఇతర వాహనదారులతో పాటు, స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు స్పందించి ఆక్రమణలు తొలగించడంతో పాటు, ట్రాఫిక్ కష్టాలను తీర్చాలని ప్రజలు కోరుతున్నారు.

రోడ్డు పక్కన నిలిపితే ఫైన్

సాగర్ రహదారికి ఇరువైపులా దుకాణాల ఎదుట తోపుడు బండ్లు ఏర్పాటు చేయడం, షెడ్లను నిర్మించడం, రోడ్లపైనే వాహనాలను నిలుపుతున్నారు. అలాంటి వారిపై తగిన చర్యలు తీసుకున్నాం. చలానా విధిస్తున్నాం. మున్సిపాలిటీ సహకారంతో సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం.

– బి.గురు నాయుడు, ట్రాఫిక్ సీఐ, ఇబ్రహీంపట్నం

ఉపేక్షించేది లేదు



దుకాణాల ఎదుట గతంలో ఇష్టానుసారంగా షెడ్లను ఏర్పాటు చేస్తే పూర్తిగా తొలగించాము. అయినా మళ్లీ మొదటికి వచ్చింది. అలాంటి వాటిని ఉపేక్షించేది లేదు. పూర్తిస్థాయిలో పరిశీలన చేస్తాం. పోలీసుల సహకారంతో వాటిని తొలగించి, ట్రాఫిక్ సమస్యను అధిగమిస్తాం.

– కె.అమరేందర్ రెడ్డి, కమిషనర్, తుర్కయంజాల్



నందివనపర్తిలో ధాన్యం నిల్వలను పరిశీలిస్తున్న సూర్యరావు

ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలి

- రైతులను ఇబ్బంది పెడితే చర్యలు
- అడిషనల్ డీఆర్‌డీఓ సూర్యరావు

యాచారం: ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని, సేకరణ విషయంలో రైతులను ఇబ్బందులకు గురి చేస్తే బాధ్యులపై చర్యలు తప్పవని అడిషనల్ డీఆర్‌డీఓ సూర్యరావు హెచ్చరించారు. మండల పరిధి చింతపట్ల, నందివనపర్తి గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం ఆయన పరిశీలించారు. కొనుగోలు తీరుపై రైతులు, డ్వాక్రా మహిళలను అడిగి తెలుసుకున్నారు. నిబంధనల అమలు, ఎప్పుడు కొనుగోలు చేస్తున్నారు, ధాన్యం నిల్వలకు రక్షణ, వర్షాలు కురిస్తే రైతులకు కల్పిస్తున్న సౌకర్యాలపై ఆరా తీశారు. అనంతరం మాట్లాడుతూ.. నిబంధనల పేరుతో రైతులను ఇబ్బందులకు గురిచేస్తే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని, రైతులు ధాన్యం తెచ్చిన వెంటనే కొనుగోలు చేసి, లారీల్లో పంపాలని ఆదేశించారు. అనంతరం వారి బ్యాంకు ఖాతాల్లో సకాలంలో డబ్బు జమ అయ్యేలా చూడాలని సూచించారు. రికార్డులు తనిఖీ చేశారు. పంట నమోదు వివరాలను వ్యవసాయ విస్తరణ అధికారులకు తెలియజేయాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఏపీఎం సాంబశివుడు, సీసీలు గణేశ్, రాజు, నర్సింహ, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే

ఆమనగల్లు: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతాయని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. నగరంలోని తన నివాసంలో ఆమనగల్లు మండలం మేడిగడ్డతండాకు చెందిన ఈశ్వర్‌కు మంజూరైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కును శనివారం ఆయన అందజేసి మాట్లాడారు. ప్రజా సంక్షేమమే ప్రభుత్వం లక్ష్యమన్నారు. నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు అయ్యాయని తెలిపారు. మరో వెయ్యి ఇళ్లు అదనంగా మంజూరు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరానని, దీనికి ఆయన సానుకూలంగా స్పందించారని వివరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు వెంకట్‌రెడ్డి, వెంకటేశ్వర్లుగౌడ్, విజయ్‌రాథోడ్, బాబా, జగన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక పరిస్థితి బాగాలేదంటూ.. పోటీలా

- ప్రశ్నిస్తే అరెస్టులా.. ఇదేక్కడి న్యాయం
- సీపీఎం జిల్లా కార్యదర్శి యాదయ్య



ఇబ్రహీంపట్నం ఠాణాలో సీపీఎం నేతలు
చిత్రంలో ఏసీపీ రాజు

ఇబ్రహీంపట్నం: రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేదంటూ.. అందాల పోటీలు ఎలా నిర్వహిస్తారని ప్రశ్నిస్తే అరెస్టు చేస్తారా?. ఇదేక్కడి న్యాయమని సీపీఎం జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య ప్రభుత్వంపై మండిపడ్డారు. రామోజీ ఫిల్మ్ సిటీని అందాల భామలు(మిస్ వరల్డ్ పోటీలకు వచ్చిన తారలు) శనివారం సందర్శించిన నేపథ్యంలో ఆయనతో పాటు పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు సామేల్, పి.జగన్, మున్సిపల్ కార్యదర్శి ఎల్లేశ్, మహిళా సంఘం నాయకురాలు మస్కు అరుణను పోలీసులు ముందస్తు అరెస్టు చేసి, ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. దీనిని యాదయ్య తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో నెలకొన్న సమస్యలను గాలికొదిలేసిన ప్రభుత్వం.. అందాల పోటీలకు వచ్చిన విదేశీ యువతులను రాష్ట్రమంతటా తిప్పటమేంటన్నారు. పెట్టుబడిదారుల కోసం మహిళలను వ్యాపార సరుకులుగా మారుస్తున్నారని ఆరోపించారు. అతివలపై జరుగుతున్న అఘాయిత్యాలను అరికట్టాల్సింది పోయి, ఆర్థికంగా రాష్ట్రం దివాళా తీసిందంటూ రూ.కోట్లు అందాల పోటీలకు ఖర్చుపెట్టడం ఏంటని ప్రశ్నించారు. అందాల పోటీలకు పెడుతున్న ఖర్చును, మహిళల అభ్యున్నతికి, రక్షణకు ఉపయోగిస్తే బాగుండేదన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించే దిశగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అడుగులు వేయాలని సూచించారు. కాగా అరెస్టు చేసిన నేతలను పోలీసులు వదిలిపెట్టారు.

ఎమ్మెల్యే మల్‌రెడ్డికి మంత్రి పదవి ఇవ్వాలి

ఇబ్రహీంపట్నం: ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అభివృద్ధి చెందాలంటే ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి మంత్రి పదవి ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు, మాజీ సర్పంచ్ పల్లె గణేశ్‌గౌడ్ కోరారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గానికి మంత్రివర్గంలో కొన్నేళ్లుగా స్థానం దక్కడంలేదని, దీంతో నగరానికి చేరువలో ఉన్నా.. కానిస్టెన్సీ అభివృద్ధిలో వెనుకబడిందని, ఇప్పుడిప్పుడే వృద్ధిలోకి వస్తుందని పేర్కొన్నారు. ఎంతో అనుభవమున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డికి మంత్రి వర్గంలో స్థానం కల్పిస్తే నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందని, యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. ఉమ్మడి జిల్లాతో పాటు.. హైదరాబాద్ జిల్లాలపై రంగారెడ్డికి పట్టు ఉందని, గతంలో మలక్‌పేట ఎమ్మెల్యేగా పదేళ్లు పనిచేశారని తెలిపారు. రానున్న మున్సిపల్, స్థానిక సంస్థలు, గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించే సత్తాగల నాయకుడు మల్‌రెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పార్టీ అధిష్టానం మల్‌రెడ్డికి మంత్రి పదవి ఇవ్వాల్సిన ఆవశ్యకతను గుర్తించాలని కోరారు.

‘పూలబాట శతకం’ ఆవిష్కరణ



పుస్తకం ఆవిష్కరిస్తున్న గోరటి వెంకన్న

ఇబ్రహీంపట్నం రూరల్: ‘పూలబాట శతకం’ పుస్తకాన్ని నగరంలోని రవీంద్ర భారతిలో ప్రజాకవి గోరటి వెంకన్న, తెలుగు సాహిత్య అకాడమీ అధ్యక్షుడు నమోజు బాలచారీలు శనివారం ఆవిష్కరించారు. ఇబ్రహీంపట్నం మండలం నాగన్‌పల్లి గ్రామానికి చెందిన ఏదుల్ల బాలరాజు రచించిన ‘పూలబాట శతకం’ పుస్తకాన్ని, అనంత సాహిత్య సాంస్కృతిక వేదిక ద్వితీయ వార్షికోత్సవంలో భాగంగా రచయిత బాలరాజు చిన్ననాటి గురువు అభినవ దాశరధి బిరుదాంకితులు దోరవేటి చెన్నయ్య ఆధ్వర్యంలో జాతికి అంకితం చేశారు. ఈ సందర్భంగా ప్రైవేటు ఉపాధ్యాయుడిగా పని చేస్తూ శతకాలు రాసి, ప్రచురిస్తున్న రచయిత ఏదుల్లను అభినందించారు. మల్కాపురం మాజీ ఎంపీటీసీ చిట్టింపల్లి శ్రీనివాసరావు, ప్రభుత్వ ఉపాధ్యాయులు ధన్‌రాజ్ తోటి ఉపాధ్యాయ మిత్రులు ప్రశంసించారు.

అభివృద్ధి పనులు పూర్తిచేయండి

బీఆర్‌ఎస్ నాయకుల డిమాండ్



కళాశాల భవనం వద్ద బీఆర్‌ఎస్ నాయకులు

ఆమనగల్లు: పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయాలని బీఆర్‌ఎస్ ఆమనగల్లు మున్సిపాలిటీ అధ్యక్షుడు పత్యానాయక్ డిమాండ్ చేశారు. పట్టణంలో అసంపూర్తిగా ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనాన్ని శనివారం పార్టీ నాయకులతో కలిసి పరిశీలించి మాట్లాడారు. గత ప్రభుత్వం కళాశాల నిర్మాణానికి రూ.2 కోట్లు మంజూరు చేసిందని, భూ వివాదం కారణంగా పనులు నిలిచిపోయాయని తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం.. భూ వివాదాన్ని పరిష్కరించి, విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు. రూ.4.5 కోట్లతో నిర్మించిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులు అసంపూర్తిగా నిలిచాయని, పనులు పూర్తి చేయడానికి కాంగ్రెస్ ప్రజా ప్రతినిధులు ఎందుకు చొరవ తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ఆమనగల్లు మార్కెట్‌యార్డులో తడిసిన వరిధాన్యాన్ని కొనుగోలు చేసి, రైతులకు న్యాయం చేయాలన్నారు. రేపు ముఖ్యమంత్రి పర్యటన ఉందని, సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు పంతునాయక్, శ్రీనునాయక్, వస్పుల సాయిలు, యాదయ్య, గణేశ్, నాగిళ్ల జగన్, మల్యానాయక్, పంతునాయక్, మల్లేశ్, మహేశ్‌నేత, శ్రీకాంత్‌నాయక్, మణిపాల్, యాదగిరి, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు మెడికల్ కిట్లు పంపిణీ

మాడ్గుల: మండల పరిధి అర్కపల్లి గ్రామంలో ఉప్పల చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో శనివారం గర్భిణులకు బీఆర్‌ఎస్ నాయకుడు, మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్ గుప్తా మెడికల్ కిట్లు అందజేశారు. కార్యక్రమంలో సింగిల్ విండో డైరెక్టర్ రాజావర్ధన్ రెడ్డి, మాజీ ఎంపీటీసీలు చంటి, బ్రహ్మం, నాయకులు శివ, చెన్నకేశవులు, శంకర్, వంశీ, గణేశ్, మల్లేశ్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఇబ్రహీంపట్నం: చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా దండుమైలారం సబ్ స్టేషన్ 11 కేవీ ఫీడర్ పరిధిలో ఆదివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని ఏఈ అఖిలేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నెర్రపల్లి గ్రామానికి ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు సరఫరా నిలిపివేయనున్నామని పేర్కొన్నారు. ఈ అసౌకర్యానికి చింతిస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

రైతు సంక్షేమమే ధ్యేయం

టెస్కాబ్ వైస్ చైర్మన్ సత్తయ్య



సమావేశంలో మాట్లాడుతున్న సత్తయ్య తదితరులు

తుర్కయంజాల్: రైతు సంక్షేమమే ధ్యేయంగా సహకార సంఘాలు పనిచేస్తున్నాయని టెస్కాబ్ వైస్ చైర్మన్, డీసీసీబీ చైర్మన్, తుర్కయంజాల్ రైతు సేవా సహకార సంఘం చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య అన్నారు. శనివారం ఆయన అధ్యక్షతన సంఘం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. 11 మందిని నూతన సభ్యులుగా చేర్చుకున్నామని, 9 మంది రైతులకు ఒక కోటి 25 లక్షల రూపాయలను అప్పుగా మంజూరు చేశామని తెలిపారు. అదేవిధంగా 2024- 25 ఆర్థిక సంవత్సరం ముగింపు లెక్కలతోపాటు 2025- 26 ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ జమ, ఖర్చులను ఆమోదించామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం వైస్ చైర్మన్ కొత్త రాంరెడ్డి, డైరెక్టర్లు చెక్క లక్ష్మమ్మ, సామ సంజీవరెడ్డి, కుతాడి నర్సింగ్ రావు, కొండ్రు స్వప్న శ్రీనివాస్, చాపల యాదగిరి, శీలం లక్ష్మమ్మ, జక్క కృష్ణారెడ్డి, సామ సత్యనారాయణ రెడ్డి, సెక్రటరి వై.రాందాసు తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీల నియామకం



నూతన సభ్యులతో రవీంద్రా చారి

తుర్కయంజాల్: ప్రజా సమస్యలపై భారత కమ్యూనిస్టు పార్టీ నిరంతరం పోరాడుతుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆందోజు రవీంద్రా చారి అన్నారు. శనివారం తుర్కయంజాల్‌లో ఏర్పాటు చేసిన పార్టీ శాఖ మహాసభలకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పార్టీ తరఫున భవిష్యత్తులో మరిన్ని ఉద్యమాలు చేపట్టనున్నామని పేర్కొన్నారు. అనంతరం రాగన్నగూడ, తుర్కయంజాల్, బ్రాహ్మణపల్లి, తొర్రూర్‌లకు పార్టీ నూతన కమిటీలను ఎన్నుకున్నారు. రాగన్నగూడ కార్యదర్శిగా గంధం బాలరాజు, సహాయ కార్యదర్శిగా సి.పురుషోత్తం, తుర్కయంజాల్ కార్యదర్శిగా కె. నరేందర్ గౌడ్, సహాయ కార్యదర్శి కె.శేఖర్, తొర్రూర్ శాఖ కార్యదర్శిగా రాచమల్ల బాలకృష్ణ, బ్రాహ్మణపల్లి శాఖ కార్యదర్శిగా కాటమయ్య, సహాయ కార్యదర్శులుగా ఎస్.జగన్ మోహన్ రెడ్డి, వి.ముత్తయ్యలను ఏకగ్రీవంగా నియమించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు లక్ష్మణ్, నారాయణ రెడ్డి, ముజీబ్, బాల్‌రెడ్డి, వెంకటయ్య, కవిత, విజయ తదితరులు పాల్గొన్నారు.

రాహుల్ పర్యటనను అడ్డుకోవడం అప్రజాస్వామికం

- యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్
- మోదీ, నితీశ్‌ల దిష్టిబొమ్మల దహనం



మోదీ, నితీశ్‌కుమార్‌ల దిష్టిబొమ్మ దహనం చేస్తున్న యూత్ కాంగ్రెస్ నాయకులు

కడ్తాల్: బీహార్ రాష్ట్రం దర్భాంగలోని అంబేడ్కర్ హాస్టల్‌లో దళిత విద్యార్థులను కలిసేందుకు వెళ్లిన లోక్‌సభలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్‌గాంధీని బీజేపీ, జేడీయూ ప్రభుత్వం అడ్డుకోవడం ప్రజాస్వామ్యంపై దాడేనని యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి క్యామ రాజేశ్ అన్నారు. రాహుల్ పర్యటనను అడ్డుకోవడాన్ని నిరసిస్తూ శనివారం మండల కేంద్రంలో యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు షాబుద్దీన్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ, బీహార్ ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్‌ల దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఈ సందర్భంగా యూత్ నాయకులు మాట్లాడుతూ.. విద్యార్థుల సమస్యలు తెలుసుకోవడానికి హాస్టల్‌కు వెళ్లిన రాహుల్‌ను అక్కడి ప్రభుత్వం అడ్డుకోవడం ప్రజాస్వామ్య విలువలకు విఘాతమన్నారు. ఆ ప్రభుత్వం దళిత హక్కులను, భావ ప్రకటన స్వేచ్ఛను అణచివేయాలని చూస్తోందని ఆరోపించారు. బీహార్‌లో త్వరలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఎక్కడ ఓడిపోతామనే భయంతో ఇలాంటి చర్యలకు పాల్పడుతోందని విమర్శించారు. ఇలాంటి నియంతృత్వ పోకడలను అవలంబిస్తే ప్రజల మద్దతుతో భారీ ఉద్యమాన్ని చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రవి, పట్టణ అధ్యక్షుడు భానుకిరణ్, నాయకులు శ్రీకాంత్, ఆకాశ్‌గౌడ్, రమేశ్, దర్శన్, విజ్జు, మహేందర్, యశ్వంత్, శివ, శ్రీకాంత్, ప్రవీణ్‌గౌడ్, మహేశ్, కుమార్ తదితరులు ఉన్నారు.